సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత

ఎల్ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, ఆగస్టు 14 : అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడికి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్ఓసీ) ఇప్పించారు. ఎంపీ స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన నిరుపేద దుబ్బాక రవి 22 ఏళ్ల కుమారుడు రణధీర్ అనారోగ్యానికి గురై హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎంపీ వద్దిరాజు సిఫార్సు లేఖను అధికారులు పరిశీలించి రూ.2 లక్షల ఎల్ఓసీ మంజూరు చేశారు. ఆ ఎల్ఓసీ పత్రాన్ని రణధీర్ తండ్రి రవికి హైదరాబాద్‌లో బుధవారం ఎంపీ రవిచంద్ర అందజేశారు. ఎంపీ వద్దిరాజుకు రవి కృతజ్ఞతలు తెలిపారు.

సీపీ సునీల్ దత్‌కు ప్రెసిడెంట్ మెడల్

పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

మామిళ్లగూడెం, ఆగస్టు 14 : జాతీయస్థాయిలో కేంద్ర హోంశాఖ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రకటించిన అవార్డుల్లో ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌కు గ్యాలంట్రీ పతకం(ప్రెసిడెంట్ మెడల్) లభించింది. దేశవ్యాప్తంగా పోలీస్, ఫైర్, హోంగార్డు, సివిల్ డిఫెన్స్ సర్వీసుల్లో పనిచేసే 1,037 మంది అధికారులకు ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు. పోలీస్ కమిషనర్‌కు జిల్లా పోలీస్ యంత్రాంగం శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ క్యాడర్ 2014 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సునీల్‌దత్ రాష్ట్రంలో వివిధ హోదాల్లో పనిచేశారు. భద్రాచలం ఏఎస్పీ, జగిత్యాల ఎస్పీ, భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ, హైదరాబాద్ ఈస్ట్ జోన్ డీసీపీగా పనిచేస్తూ ఎన్నికల సమయంలో జరిగిన బదిలీల్లో భాగంగా 2024 జనవరి 5 నుంచి ఖమ్మం పోలీస్ కమిషనర్‌గా పని చేస్తున్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన సీపీ

వైరాటౌన్, ఆగస్టు 14 : వైరా పట్టణంలో నిర్వహించే సభకు సీఎం రేవంత్‌రెడ్డి రానున్నందున భద్రతా ఏర్పాట్లను సీపీ సునీల్‌దత్, కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ బుధవారం పరిశీలించారు. హెలీప్యాడ్, సభావేదికను సందర్శించారు. పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలని పోలీస్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. పలు ప్రాంతాల నుంచి బహిరంగ సభకు వాహనాలకు, ప్రజలకు ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా నగర పర్యటన సజావుగా సాగేలా 950 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు నరేశ్‌కుమార్, ప్రసాద్‌రావు, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు.

హామీలను ముఖ్యమంత్రి నిలబెట్టుకోవాలి

వైరాటౌన్, ఆగస్టు 14 : రాష్ట్రంలోని అగ్రిగోల్డ్ ఆస్తులను వేలం వేసి బాధితులకు డబ్బులు చెల్లించి న్యాయం చేస్తామని ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి యర్రా బాబు, తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గుడిమెట్ల రజిత డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో యామాల గోపాలరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు.

సత్తుపల్లిటౌన్, ఆగస్టు 14 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ప్రజలకు అనేక వాగ్దానాలు ఇచ్చిందని, వాటిని తక్షణమే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక నేలరామచంద్రయ్యభవనంలో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అమర్లపూడి శరత్, తాటి రాజు, కొరసా వెంకటేశ్వర్లు, ఒగ్గు నాగిరెడ్డి, దుంప రాఘవులు పాల్గొన్నారు.

రెవెన్యూ చట్టంలో పూర్తి మార్పులు రావాలి

కొణిజర్ల, ఆగస్టు 14 : రాష్ట్రంలో రెవెన్యూ భూములకు ఉన్న ఎన్నో రకాల పేర్లను మార్చివేసి అందరికీ రెవెన్యూ పట్టాలు ఇవ్వాలని అఖిల భారత రైతుకూలీ సంఘం, సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా బాధ్యులు షేక్ ఖాసీం పేర్కొన్నారు. బుధవారం కొణిజర్లలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆలోచించి పట్టాలిచ్చిన భూములకు, ఇంకా వేలాది ఎకరాల భూములకు రెవెన్యూ పట్టాలు ఇవ్వాలన్నారు.

పరేడ్‌గ్రౌండ్ ముస్తాబు

మామిళ్లగూడెం, ఆగస్టు 14 : స్వాతంత్ర్య దిన వేడుకలకు ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అధికారులు బుధవారం ఏర్పాట్లు పూర్తిచేశారు. వేడుకల్లో గురువారం ఉదయం 9:05 గంటలకు ఉప ముఖ్యమంత్రి మంత్రి మల్లు భట్టి విక్రమార్క జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీదత్‌తో కలిసి కార్యక్రమాల్లో పాల్గొని పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించనున్నారు.

జమలాపురం ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు

ఎర్రుపాలెం, ఆగస్టు 14: తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు ప్రాతఃకాలంలో సర్వాంగాభిషేకం నిర్వహించిన తరువాత స్వామివారికి, అమ్మవారికి పట్టువస్త్రాలను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈవో జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేటు ఎలక్ట్రీషియన్లకు సరైన శిక్షణ అవసరం'

ఎర్రుపాలెం, ఆగస్టు 14: వృత్తిపరమైన సవాళ్లను అధిగమించేందుకు, కొత్త విధానాలకు అనుగుణంగా నిరంతరం సర్టిఫికేషన్ పొందేందుకు ప్రైవేటు ఎలక్ట్రీషియన్లకు సరైన శిక్షణ అవసరమని ప్రైవేటు ఎలక్ట్రీషియన్ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడల అంజయ్య అన్నారు. మండలంలోని మీనవోలు గ్రామంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్నాసి బాలరాజు అధ్యక్షతన బుధవారం జరిగిన సంఘం సమావేశంలో మాట్లాడారు. సంఘం బాధ్యులు ఉమామహేశ్వరరావు, నాగప్రసాద్ పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **నేలకొండపల్లి బ్రాంచ్** వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **మునగంటి నాగావారి,** S/o : **భిక్షమయ్య, వయస్సు** : 39 సం||లు, **వృత్తి** : వ్యాపారము, **నివాసం** : ఇ.నెం. 5-44, తల్లంపాడు గ్రామం, ఖమ్మం రూరల్ మండలము, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇప్పుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : ఖమ్మం జిల్లా, కూసుమంచి సబ్ రిజిస్ట్రారు వారి అధికార పరిధిలోని, ఖమ్మం జిల్లా, కూసుమంచి రెవిన్యూ మండలము, గట్టుసింగారం గ్రామ పంచాయితీ పరిధిలోని, గట్టుసింగారం రెవిన్యూ గ్రామ సర్వే నెం. 391/ఇ మింజుమలె, మొత్తం విస్తీర్ణం. 605-00 చ||గ|| = 505-85 చ||మీ||, **డాక్యుమెంట్ నెం.1739/2024** గల అట్టి స్థిరాస్తినకు సరిహద్దులు : **తూర్పు:** 30 అడుగుల వెడల్పు గల రోడ్డు, **పడమర :** సిరిదాసు సీతమ్మ గారి వ్యవసాయ భూమి, **ఉత్తరం :** డి.విజయ గారి వ్యవసాయ భూమి, **దక్షిణం :** గట్టు సింగారం నుండి జర్ముల్‌రావుపేట వెళ్ళు ఆర్ అండ్ బి రోడ్డు.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

మృతుడి కుటుంబానికి సాయం

ఖమ్మం, ఆగస్టు 14 : ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 48వ డివిజన్‌లో జవాన్‌గా విధులు నిర్వహిస్తున్న జానీ ట్రాక్టరు మీద నుంచి పడి బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ తోట రామారావు ద్వారకనగర్ లోని జానీ ఇంటికెళ్లి మృతదేహం వద్ద నివాళి అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపి, రూ.10 వేల సాయం అందజేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616

తగ్గని జ్వరాల తీవ్రత

నేలకొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో జ్వర బాధితులు

కూసుమంచి (నేలకొండపల్లి)/ ముదిగొండ, ఆగస్టు 14: నేలకొండపల్లి మండలంలో జ్వరాల తీవ్రత తగ్గడం లేదు. ఇక్కడి ప్రభుత్వాసుపత్రికి బుధవారం కూడా 450కిపైగా రోగులు రావడం ఇందుకు నిదర్శనంగా కన్పిస్తోంది. వారం రోజులుగా దాదాపుగా ఇంతే సంఖ్యలో రోగులు వస్తుండడంతో వైద్యులు అప్రమత్తమయ్యారు. అవసరమైన వారికి సెలైన్లు ఎక్కించి ఇళ్లకు పంపారు. బుధవారం ఖమ్మం ఆసుపత్రిలో రక్త పరీక్షలు చేసే యంత్రం మొరాయించడంతో ఇక్కడి రోగుల నుంచి రక్త నమూనాలను సేకరించలేదు. ఇక్కడి వైద్యశాలలో 30 బెడ్లు మాత్రమే ఉండడంతో ఇన్ పేషెంట్లకు ఇబ్బంది కలుగుతోంది. అవి సరిపోకపోవడంతో తక్షణ వైద్య సహాయం అందించి ఇళ్లకు పంపిస్తున్నారు. ఇక నేలకొండపల్లి మండలంలోనూ డెంగీ ప్రబలుతోంది. సీజనల్ వ్యాధులు కూడా సమాంతరంగానే ఉన్నాయి. ముదిగొండ మండలంలో గడిచిన రెండు నెలల కాలంలో మూడు డెంగీ కేసులు నమోదు కావడం గమనార్హం. ఇటీవల న్యూలక్ష్మీపురంలో మరో డెంగీ కేసు రావడంతో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వెంకటరమణ బుధవారం ఆ గ్రామాన్ని సందర్శించారు. సదరు రోగి ఇంటికి వెళ్లి పరీక్షించి వైద్యం అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్యాధికారి అరుణాదేవి పాల్గొన్నారు.

సీఎం పర్యటనను అడ్డుకుంటాం..

పీడీఎస్‌యూ, పీవైఎల్ జిల్లా నాయకులు వెంకటేశ్, సురేశ్

వైరాలో ర్యాలీ

వైరాటౌన్, ఆగస్టు 14 : రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, జనరల్ యూనివర్సిటీపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ, పీవైఎల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వైరా మండల కేంద్రంలో బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేశ్, పీవైఎల్ రాష్ట్ర నాయకుడు మందా సురేశ్ మాట్లాడుతూ వైరాలో ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేయాలని, తల్లాడలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, జేఎన్‌టీయూహెచ్, మెడికల్ నర్సింగ్ కాలేజీ భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పై సమస్యలు పరిష్కరించని పక్షంలో సీఎం పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీవైఎల్, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు శ్రీను, లక్ష్మణ్, సంధ్య, ప్రియాంక, అనూష, అక్బర్, ఝాన్సీ, జాన్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న ఖమ్మం జిల్లా రైతుల కల

సత్తుపల్లిటౌన్, ఆగస్టు 14 : ఎన్నో ఏళ్ల నుంచి గోదావరి జలాల కోసం ఎదురు చూస్తున్న ఖమ్మం జిల్లా రైతుల కలలు నేటితో తీరనున్నాయని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. గోదావరి జలాలను ఖమ్మం జిల్లాకు తీసుకురానున్న ప్రాజెక్టుకు సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ప్రారంభించనున్నారని ఆమె చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఇప్పటికే 100 కోట్లతో పలుఅభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించానని, రాబోయే రోజుల్లో మరో రెండు, మూడు వందల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు నియోజకవర్గంలో ఖర్చు చేయనున్నట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో మట్టా దయానంద్, చల్లగుండ్ల నరసింహారావు, ఉడతనేని అప్పారావు, సుబ్బారెడ్డి, గాదె చెన్నారావు, వేణు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు చెట్లు దోహదం

పర్యావరణ పరిరక్షణకు చెట్లు ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. బుధవారం పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో 'స్వచ్ఛదనం- పచ్చదనం'లో భాగంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు.

రేగళ్లపాడులో బోరు ఏర్పాటు

మండలంలోని రేగళ్లపాడులో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎమ్మెల్యే మట్టా రాగమయి హోప్ మినిస్ట్రీస్ డైరెక్టర్ శామ్యూల్ ప్రత్యేక చొరవతో వారి సంస్థ ద్వారా మంచినీటి బోరును వేయించారు. ఈ బోరును బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు.

అమ్మవారికి బోనాలు

కూసుమంచిలో..

తిరుమలాయపాలెంలో..

కూసుమంచి/ తిరుమలాయపాలెం/కారేపల్లి, ఆగస్టు 14: కూసుమంచి, తిరుమలాయపాలెం, కారేపల్లి మండలాల ప్రజలు బోనాల పండుగను బుధవారం వైభవంగా జరుపుకున్నారు. తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు, కాకరవాయి, మహ్మదాపురం, హస్నాబాద్ తదితర గ్రామాల ప్రజలు బోనాలతో వెళ్లి వాటిని ముత్యాలమ్మ తల్లికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తమ కుటుంబాలను, గ్రామస్తులను చల్లగా చూడాలని గ్రామదేవతను వేడుకున్నారు. అలాగే, కూసుమంచి ఎస్సీ కాలనీ వాసులు డీజేలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. కేపీఆర్ జ్యూయలరీస్ బాధ్యుడు పాపారావు అమ్మవారికి బంగారు కళ్లను బహూకరించారు.

దాడి ఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలు

రఘునాథపాలెం, ఆగస్టు 14 : రోకలిబండపై దాడిచేసిన ఘటనలో బుధవారం వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. రఘునాథపాలెం మండల పరిధిలోని గణేశ్వరం గ్రామానికి చెందిన ఆళ్లకుంట ఎల్లయ్య తన భార్యను మందలించడంతో పక్కనే నివాసం ఉండే తండ్రి దుంప భద్రయ్యకు చెప్పుకుంది. ఈ విషయంపై మాట్లాడేందుకు వచ్చిన భద్రయ్యపై ఎల్లయ్య అన్న రాములు జోక్యం చేసుకొని రోకలిబండతో దాడిచేశాడు. ఈ ఘటనలో భద్రయ్యకు తీవ్రగాయాలయ్యాయి.

స్థల వివాదంలో దౌర్జన్యం

మామిళ్లగూడెం, ఆగస్టు 14 : ఇంటి స్థల వివాదంలో బెదిరిస్తున్నారని బాధితుడు కొమ్మిశెట్టి కోటయ్య బుధవారం రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. ఖమ్మం నగరంలోని వేణుగోపాల్‌నగర్‌లో తన స్థలంలో పిచ్చిమొక్కలు దట్టంగా పెరగడంతో దానిని చదును చేయిస్తుండగా కొందరు వ్యక్తులు వచ్చి దౌర్జన్యానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

కొణిజర్ల, ఆగస్టు 14 : ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సిఫారసుతో మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను డీసీసీ ఉమెన్స్ సెక్రటరీ ధర్మసోతు సౌందర్య బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వెంకటేశ్వర్లుకు రూ.16వేలు, నాగేశ్వరరావుకు రూ.18 వేలు, పద్మకు రూ.13 వేలు, రామకృష్ణకు రూ.13 వేల చెక్కులను పంపిణీ చేశారు.

కిష్టారం పాఠశాలకు యాంప్లిఫయర్ వితరణ

సత్తుపల్లి, ఆగస్టు 14 : మండలంలోని కిష్టారం ప్రాథమిక పాఠశాలకు సత్తుపల్లిలోని నల్లబోతుల మంగయ్య మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో వారి కుమారుడు నల్లబోతుల ప్రసాద్, మనువడు, ట్రస్టు అధ్యక్షుడు నల్లబోతుల నర్సన్ బుధవారం రూ.5 వేలు విలువ చేసే మొబైల్ యాంప్లిఫయర్‌ను హెచ్ఎం ప్రభుదాస్‌కు వితరణగా అందజేశారు.

లంకపల్లిలో వైద్యశిబిరం

పెనుబల్లి/ వేంసూరు, ఆగస్టు 14 : మండలంలోని లంకపల్లిలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు, ఆశాలు ఇంటింటికీ తిరిగి జ్వర సర్వే నిర్వహించి పలుసూచనలు చేశారు. 62 మందికి పరీక్షలు నిర్వహించి 26మంది రక్తనమూనాలను సేకరించారు. వేంసూరు మండలంలోని జయలక్ష్మీపురం, రామన్నపాలెం గ్రామాల్లో పీహెచ్‌సీ వైద్యులు ఇందుప్రియాంక ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. 72మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

వ్యవసాయ కూలీకి పాముకాటు

పెనుబల్లి, ఆగస్టు 14 : మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన వ్యవసాయ కూలి గుగులోతు ప్రశాంత్ పత్తి చేనులో కూలీ పనికి వెళ్లాడు. అక్కడ ప్రశాంత్‌ను పాము కాటు వేయడంతో వెంటనే తోటి కూలీలు పామును చంపివేసి అతనిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు సూచించడంతో ఖమ్మం తరలించేందుకు అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం ప్రైవేటు అంబులెన్స్‌లో ఖమ్మం తరలించారు.

ఏసీబీ అధికారుల పేరుతో హల్‌చల్

రఘునాథపాలెం, ఆగస్టు 14: ఏసీబీ అధికారులం అని చెప్పి రఘునాథపాలెం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం నకిలీ అధికారులు హల్‌చల్ చేశారు. గురుకుల పాఠశాలల్లో అక్రమాలపై రాష్ట్ర వ్యాప్తంగా ఏసీబీ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. దీనిని ఆసరా చేసుకున్న కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కేజీబీవీలోకి ప్రవేశించారు. తాము ఏసీబీ అధికారులం అని చెప్పి పాఠశాలలో టిఫిన్, పాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకాధికారి లత లేకపోవడంతో కాసేపు హడావుడి చేసి వెళ్లిపోయారు. దీనిపై ఎస్‌వో లత పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీడీపీవోను కలిసిన ఐఎన్‌టీయూసీ నేతలు

ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 14 : అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిగా బాధ్యతలు స్వీకరించిన వీరభద్రమ్మను బుధవారం ఐఎన్‌టీయూసీ(ఐసీడీఎస్ అనుబంధ విభాగం) నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. నగరంలోని అర్బన్ ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవోను సంఘం టీఎన్‌జీఓస్ అనుబంధ రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు కొండా పద్మ ఆధ్వర్యంలో కలిసి నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మోహన్‌నాయుడు, అర్బన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు ఉల్లంగి పద్మ, రాష్ట్ర కార్యదర్శి సామినేని భవాని, నాగమణి, విజయకుమారి, వినోద పాల్గొన్నారు.

ఎంసీహెచ్‌ను సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్

ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 14 : జిల్లా సార్వజనీన ఆసుపత్రి పరిధిలోని మాతా, శిశు సంరక్షణ కేంద్రాన్ని బుధవారం అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ సందర్శించారు. మదర్ మిల్క్ బ్యాంకు, ఎన్ఆర్‌సీ వార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వార్డులోకి వెళ్లి పలువురు గర్భిణులు, తల్లులు, వారి సహాయకులను పరామర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. జ్వరాల తీవ్రత గురించి వైద్యులను ఆరా తీశారు. అసిస్టెంట్ కలెక్టర్ వెంట ఎంసీహెచ్ ఇన్‌చార్జి డాక్టర్ బాబూరత్నాకర్, ఇతర వైద్యులు ఉన్నారు

'ఫస్ట్ ఎయిడ్ చేసి పీహెచ్‌సీకి రిఫర్ చేయండి'

బోనకల్లు, ఆగస్టు 14: గ్రామాల్లో జ్వరం సోకిన వారికి ఎటువంటి ఐవీ యాంటీ బయాటిక్స్, ఐవీ ఫ్లూయిడ్స్ వాడ వద్దని బోనకల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి స్రవంతి సూచించారు. తొలుత ఫస్ట్ ఎయిడ్ ట్రీట్‌మెంట్ వరకు ఇచ్చి పీహెచ్‌సీకు రిఫర్ చేయాలని సూచించారు. తీవ్రమైన జ్వరాలు సోకినప్పుడు వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి తెలియజేయాలని అన్నారు. జ్వరాన్ని తక్కువగా అంచనా వేస్తే ప్రాణానికి ముప్పు సంభవించే ప్రమాదం ఉంటుందని అన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రస్తుత సీజనల్ వ్యాధులపై మండలంలోని గ్రామీణ వైద్యులకు ఇక్కడి రైతువేదికలో బుధవారం ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ వైద్యులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లోని పేదలను ప్రైవేటు ఆసుపత్రులకు పంపకుండా ప్రభుత్వ సేవలు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. సీహెచ్ఓ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు దానయ్య, శ్రీలక్ష్మి, శోభ, ఏఎన్ఎంలు, ఆర్ఎంపీ సంఘం బాధ్యులు బొమ్మనేని కొండలరావు, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్‌హెచ్‌పై నేలకొండపల్లి వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ ఇవ్వాలి'

కూసుమంచి (నేలకొండపల్లి), ఆగస్టు 14: కోదాడ – కురవి మధ్య నిర్మిస్తున్న జాతీయ రహదారిపై చారిత్రాత్మక ప్రదేశమైన నేలకొండపల్లి వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ స్థానికులు చేస్తున్న దీక్ష ఎనిమిదో రోజుకు చేరుకుంది. బుధవారం ఆద్మీ పార్టీ సామాజిక కార్యకర్త పసుపులేని శ్రీనివాస్ ఒక్క రోజు దీక్షలో కూర్చొని మాట్లాడారు. ఎంట్రీ, ఎగ్జిట్ ఇవ్వపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. ఈ దీక్షకు పలు పార్టీల నాయకులు మద్దతు తెలిపారు.

సీజనల్ వ్యాధులు అరికట్టాలని ధర్నా

సత్తుపల్లిటౌన్, ఆగస్టు 14 : సీజనల్ వ్యాధులకు ప్రభుత్వ వైద్యశాలలో వైద్యసౌకర్యాలు మెరుగుపరచాలని, గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని పీవోడబ్ల్యూ, పీవైఎల్ సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు గోకినేపల్లి లలిత మాట్లాడారు. ఆసుపత్రులు రోగులతో కిక్కిరిపోతున్నాయన్నారు. దోమలు, కలుషిత ఆహారం, నీటికాలుష్యం వల్ల ఆరోగ్య సమస్యలు సంక్రమిస్తాయన్నారు. ఇళ్ల మధ్యలో ఉండే ఖాళీ స్థలాల్లో నీరు పోయే మార్గం లేక నెలల తరబడి నీరు నిల్వ ఉంటుందన్నారు. నివారణ చర్యలు చేపట్టి సీజనల్ వ్యాధులు రాకుండా అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో పరిమిళ, వెంకటనర్సయ్య, అలివేలు, వెంకటరమణ, కృష్ణవేణి, రాజు పాల్గొన్నారు.

రైతుని మోసం చేసే ప్రభుత్వం కాదు : మంత్రి తుమ్మల

వైరాటౌన్, ఆగస్టు 14 : రైతుని మోసం చేసే ప్రభుత్వం మాది కాదని, రూ.18వేల కోట్ల రూపాయలు రైతు రుణమాఫీ రిలీజ్ చేశాం, మిగిలినవి కూడా రిలీజ్ చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన సభ వద్ద ఏర్పాట్లను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. తెల్లకార్డు లేకపోయినా పాస్‌బుక్ లేకపోయినా వారి పేరు మీద అప్పు ఉంటే మాఫీ జరుగుతుందన్నారు. గురువారం రైతు రుణమాఫీ రెండు లక్షలు మాఫీ చేస్తున్నామని అన్నారు. గోదావరి జలాలు ఖమ్మం జిల్లాకు రావాలనే నా జీవిత కోరిక నెరవేరుతోందన్నారు. సీతారామ ప్రాజెక్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా లింకు కెనాల్ ప్రారంభించుకుంటున్నాం అన్నారు.

మార్కెట్‌ను సందర్శించిన జేడీ

ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 14 : ఖమ్మం నగర వ్యవసాయ మార్కెట్‌ను బుధవారం మార్కెటింగ్‌శాఖ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ ఉప్పల శ్రీనివాస్, ఉప సంచాలకులు పద్మావతి సందర్శించారు. జేడీగా శ్రీనివాస్, డీడీగా పద్మావతి ఇటీవలే బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం నగర ఏఎంసీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, జిల్లా ఇన్‌చార్జ్ మార్కెటింగ్‌శాఖ అధికారి ఎండీ అలీం, అసిస్టెంట్ సెక్రటరీ వీరాంజనేయులు, వజీర్‌లతో వారు సమావేశమయ్యారు. మార్కెట్ నిర్వహణ, ఎదురవుతున్న సమస్యలు, రైతులకు అందుతున్న పంటల మద్దతు ధరలు, తదితర విషయాలపై ఆయన ఆరా తీశారు. అనంతరం వర్తకసంఘం ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం ఆధ్వర్యంలో వ్యాపారులు జేడీ, డీడీను కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించారు.

స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం

ఖమ్మం వ్యవసాయం/ రఘునాథపాలెం, ఆగస్టు 14 : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించారు. నగరంలోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో రీజనల్ మేనేజర్ లింగస్వామి ఆధ్వర్యంలో 50మందిని సత్కరించారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ పవన్, కే రవీందర్, రంగయ్య, షేక్ ఇబ్రహీం, ప్రభాకర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మామిళ్లగూడెం, ఆగస్టు 14 : విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించడానికి రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకానికి అర్హత గల విద్యార్థుల నుంచి 2024-25 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధిశాఖ ఉప సంచాలకులు కస్తాల సత్యనారాయణ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా విద్యార్థులు యూఎస్ఏ, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, యూకే, సింగపూర్, జపాన్, సౌత్‌కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిల్యాండ్ దేశాల్లో చదువుకునే అవకాశం లభిస్తుందన్నారు. విద్యార్థులకు 2024 జూలై 1వ తేదీ నాటికి 35 ఏళ్ల వయస్సు మించరాదని తెలిపారు. అర్హులు అక్టోబర్ 13వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నలుగురు సీఐల బదిలీలు

మామిళ్లగూడెం, ఆగస్టు 14 : ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐజీ కార్యాలయంలో పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న ముస్క రాజును ఖమ్మంరూరల్ ఎస్‌హెచ్‌వోగా నియమించారు. రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ రాజిరెడ్డిని ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని సూచించారు. ఖమ్మం సీఎస్‌బీ-1 సీఐగా పని చేస్తున్న ఓ మురళిని ఇటీవల నూతనంగా సీఐ ఎస్‌హెచ్‌వోగా అప్‌గ్రేడ్ చేసిన ముదిగొండకు బదిలీ చేశారు. పీసీఆర్ ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌లో ఉన్న ఎన్.అంజలిని ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఉత్తర్వులు అందుకున్న సీఐలు వెంటనే వారి స్థానాల్లో విధుల్లో చేరాలని ఆదేశించారు.

కేయూ దూరవిద్యలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఎడ్యుకేషన్, ఆగస్టు 14 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కోఆర్డినేటర్ గోపి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్ జనరల్, కంప్యూటర్స్, బీబీఏ, బీఎస్సీ మ్యాథ్స్, బ్యాచలర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 25వ తేదీ వరకు స్థానిక అధ్యయన కేంద్రంలో దరఖాస్తు పొందాలన్నారు. ఇతర వివరాలకు 9849250633లో సంప్రదించాలని సూచించారు.

స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణకు...

ఉమ్మడి జిల్లాలోని బీసీ నిరుద్యోగ యువత నుంచి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, డైరెక్టర్ జీ శ్రీలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, సెప్టెంబర్ 1వ తేదీ నుంచి నవంబర్ 30 వరకు 90రోజులపాటు నాన్ రెసిడెన్షియల్ ప్రీ స్కిల్ డవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కాలంలో రూ.4 వేలు నెలకు చెల్లిస్తారని, ఇతర వివరాలకు 9573859598 ఫోన్‌నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

చదువుపై సోషల్ మీడియా ప్రభావం ఉండొద్దు

– జిల్లా ప్రధాన జడ్జి రాజగోపాల్

ఖమ్మం ఎడ్యుకేషన్, ఆగస్టు 14 : విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని ప్రణాళికతో సాధించుకోవాలని, సోషల్ మీడియా ప్రభావం చదువుపై పడొద్దని జిల్లా ప్రధాన జడ్జి జీ రాజగోపాల్ అన్నారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోషల్ మీడియా దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. న్యాయపరమైన అవసరాలకు డిస్ట్రిక్ట్ లీగల్ సెల్‌ను ఎలా సంప్రదించాలో సూచించారు. న్యాయ అవగాహన పుస్తకాలను కళాశాల లైబ్రరీకి అందించారు. ఐపీసీ స్థానంలో కొత్త న్యాయచట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కాళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్ఓ ప్లాంటు, ఉచిత ఏకరూప దుస్తులు అందించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కేవీ చంద్రశేఖర్, హనుమంతరావు, డీఐఈవో రవిబాబు, ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగుల ఎంపిక

ఖమ్మం ఎడ్యుకేషన్, ఆగస్టు 14 : జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులను ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేశారు. వీరిలో పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ ధాన, కార్యాలయ సూపరింటెండెంట్ ఎస్.శ్రీధర్‌బాబు, ఆఫీస్ సబార్డినేట్ ఏ. రామ్‌చరణ్‌తేజ ఉన్నారు. వీరికి గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఉత్తమ ఉద్యోగి ప్రశంసాపత్రాలు అందించనున్నారు. ఈ సందర్భంగా డీఈవో సోమశేఖరశర్మ, కార్యాలయ సిబ్బంది వారికి అభినందనలు తెలిపారు.

జాతీయ నాయకుల వేషధారణలో..

నగరంలోని త్రివేణి పాఠశాలలో బుధవారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలో చిన్నారులు జాతీయ నాయకుల వేషధారణలో అలరించారు. దేశభక్తి గీతాలు ఆలపించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దత్తత పేరుతో శిశువిక్రయం?

మామిళ్లగూడెం, ఆగస్టు 14: దత్తత పేరుతో సొంత నాయనమ్మే తన మనవడిని విక్రయించినట్లు ఆరోపణలు వెల్లువెత్తిన ఘటన ఖమ్మంలో వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. రఘునాథపాలేనికి చెందిన పందుల సాయి, ఖమ్మం నిజాంపేటకు చెందిన కొమరబోయిన స్వప్న 2021లో ప్రేమించి వివాహం చేసుకున్నారు. 2023లో సాయి రోడ్డ ప్రమాదంలో మరణించాడు. భర్త మరణించే నాటికే స్వప్న ఒక బాబుకు జన్మనిచ్చింది. అప్పటికే ఆ బాబుకు 21 నెలల వయసుంది. తన ఒక్కగానొక్క కుమారుడు మరణించినందున అతడి కొడుకైన తన మనవడిని తాను పెంచుకుంటానని, దత్తత ఇవ్వాలని సాయి తల్లి నాగమణి తన కోడలు స్వప్నను కోరింది. దీంతో స్వప్న తన కుమారుడిని తన అత్తకు అప్పగించింది. కొద్ది రోజుల తరువాత ఆమె పవర్తనపై స్వప్నకు అనుమానం కలగడంతో తన కుమారుడి గురించి ప్రశ్నించింది. దీంతో విషయం బయటకు వచ్చింది. వెంటనే స్వప్న సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల పిలిచిన కొద్దిసేపటికే నాగమణి ఆ చిన్నారిని తీసుకుని పోలీస్ స్టేషన్‌కు వచ్చింది. తన కోడలు స్వప్న దత్తత పత్రాలు రాసి ఇచ్చిందని, తాను ఎవరికీ శిశువును విక్రయించలేదని పోలీసులకు వివరించింది. దీంతో చిన్నారిని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. బాలల సంరక్షణాధికారుల సమక్షంలో బాలుడిని తల్లి స్వప్నకు అప్పగించారు. దీంతో కొడుకుని హత్తుకున్న తల్లి స్వప్న రోదించింది. అనంతరం అధికారులు ఆ శిశువును తల్లి నుంచి స్వాధీనం చేసుకున్నారు. రెండు రోజుల తరువాత అప్పగిస్తామంటూ చెప్పి పంపారు. బాలుడిని శిశు గృహానికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి కేసూ నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

విక్రయంపై అనుమానాలు?

అయితే కోడలిని నమ్మించి చిన్నారిని తీసుకొచ్చిన నాగమణి.. రూ.5 లక్షలకు అతడిని విక్రయించినట్లు బంధువులు, స్వప్న కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. వారం రోజులుగా వారి మధ్య తీవ్ర చర్చ జరుగుతోంది. పోలీసుల విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో శిశువును కొనుగోలు చేసిన వారి వద్ద ఉన్న చిన్నారిని తెల్లవారేసరికి రఘునాథపాలేనికి తీసుకుని వచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటన వెనుక ఉన్న ప్రజాప్రతినిధి, మధ్యవర్తులు కేసులో చిక్కుకోకుండా జాగ్రత్త పడుతున్నట్లు సమాచారం.